Andhra Jyothy 01-26/09/17

# చల్లని ప్రయాణం

- మెట్రోకు అనుసంధానంగా ఏసీ బస్సులు
- స్టేషన్ల నుంచి కాలనీలకు అనుసంధాన రవాణా వ్యవస్థ
- ప్రణాళికలు సిద్ధం చేస్తోన్న గ్రేటర్ ఆర్టీసీ
- టికెట్ ధర రూ.5, 10, 15
- కండక్టర్‌లు ఉండరు.. మిషన్లతో టికెట్లు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైలులో సెంట్రలైజ్డ్ ఏసీ అందుబాటులో ఉండగా.. రైలు దిగిన ప్రయాణికులను అదే అనుభూతితో గమ్య స్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ అధికారులు కసరత్తు ప్రారంభించారు. స్టేషన్ల నుంచి సమీపంలోని కాలనీలు, బస్తీలకు మినీ ఏసీ బస్సు సర్వీసు సౌకర్యం కల్పించనున్నారు. సీజన్ ఏదైనా.. సురక్షిత, చల్లని ప్రయాణం అందుబాటులోకి రానుంది. నగరంలో 72 కిలోమీటర్ల మేర మెట్రో కారిడార్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో మొదటి విడతగా మియాపూర్ టు అమీర్‌పేట, అమీర్‌పేట టూ నాగోల్ రూట్లలో నవంబర్‌లో 30 కిలోమీటర్లలో రాకపోకలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వడమే ఆలస్యం మహానగరంలో మెట్రో రైల్ కూతలు వినిపించేలా రంగం సిద్ధం చేస్తున్నారు. రహదారులపై ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గేలా తెరపైకి తీసుకువచ్చిన అధునాతన ప్రజా రవాణా వ్యవస్థ ఉద్దేశ్యం నెరవేరాలంటే అనుసంధాన రవాణా వ్యవస్థ అవసరం. ఈ క్రమంలో ఆర్టీసీ మినీ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఒక్కో స్టేషన్ నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాలనీలకు బస్ సర్వీసులు నడువనుంది. ఇప్పటికే మెట్రో స్టేషన్లకు అతి చేరువలో సోలార్ బస్టాప్‌లు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు మెట్రో అధికారులు ప్రకటించిన నేపథ్యంలో స్టేషన్లను ఆర్టీసీ అధికారులు పరిశీలించారు.

### ప్రత్యేక రూట్లు

మెట్రోస్టేషన్ల సమీపంలోని బస్తీలు, కాలనీలు, ప్రాంతాలకు ఏయే రూట్లలో బస్సులు నడిపించాలో అధికారులు రూట్‌మ్యాప్‌లు సిద్ధం చేస్తున్నారు. ప్రైవేట్ వాహనాలకు దీటుగా తక్కువ టికెట్ ధరలతో ప్రయాణికులను ఆకట్టుకునేలా ఆర్టీసీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. అక్టోబర్ మొదటి వారంలో 24 మెట్రోస్టేషన్ల నుంచి ఏయేరూట్లలో ఎన్ని ప్రాంతాలను కలుపుతూ బస్సులు నడుపుతారనే విషయాలపై మెట్రో అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు.

### కండక్టర్ లెస్ ఏసీ బస్సులు..

మెట్రో స్టేషన్ల నుంచి సమీపంలోని ప్రాంతాలకు నడిపే మినీ ఏసీ బస్సులను కండక్టర్ లేకుండా నడిపించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఆర్టీసీ ఓ ఉన్నతాధికారి తెలిపారు. టికెట్లు తీసుకోవడంలో సమస్యలు తలెత్తకుండా ఉండేలా డ్రైవర్ దగ్గరే టికెట్ మిషన్ ఏర్పాటు చేయడంతో పాటు ధరలు రూ.5, 10, 15 ఉండేలా ఏర్పాటు చేయాలని ఆర్టీసీ భావిస్తోంది.




